12

# దేవుని యొక్క పరిశుద్ధమైన యాజక జనం

"మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగును గాక, ఆమెన్. ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను జేసెను" (ప్రకటన 1:6).

వయస్సువచ్చిన మనిషిగాను, అమెరికా పౌరుడుగాను నేను రెండు రకాలైన నియమాల క్రింద జీవించాను. పసివాడనుగా, యుక్త వయస్సు రానివారి చట్టం క్రింద ఉన్నాను. ఆ కాలంలో, నేను కారు నడపడానికి వీలులేదు, సొంత యిల్లుకు గాని, బ్యాంక్ ఎకౌంటుకు గాని, ఓటు వేయడానికి గాని హక్కు లేకుండా ఉన్నాను. నా తల్లిదండ్రుల ఆధీనంలో నేను జీవించవలసియున్నాను. నా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి సంతకం చేయకపోతే, ఏ డాక్యూమెంటు మీద నా సంతకమున్నా అది దేనికీ చెల్లదు. నేను పసిబిడ్డగా భావించబడ్డాను, ప్రత్యేకమైన చట్టాలు నా జీవితాన్ని పాలించి నన్ను కాపాడాయి.

ఇప్పుడు, వయస్సు వచ్చిన వాడనుగా, నేను వేరే రకమైన చట్టాల క్రింద ఉన్నాను. ఈ చట్టాల హద్దుల్లో, నేను కారును సంపాదించుకొని నడుపవచ్చు, ఇంటికి ఓనర్నై యుండవచ్చు, బ్యాంక్ ఎకౌంట్ కలిగియుండవచ్చు, ప్రభుత్వ అధికారులపట్ల ఓటు వేయవచ్చు. ఈ చట్టాల క్రింద, నేను ఒక వ్యక్తిని, అయితే ఈ వ్యక్తిగతమైన ఆధికృతలతో వ్యక్తిగతమైన బాధ్యతలు వస్తాయి. నేను పని చేసి డబ్బు సంపాదించవచ్చు, కాని నేను సంపాదించే డబ్బుకు పన్నులు కట్టవలసియుంటుంది. నా తల్లిదండ్రుల అధికారం లేకుండ నేను సొంతగా నిర్ణయాలు చేసికొనే హక్కు నాకున్న మాట వాస్తవమే గాని, నా చర్యలకు నేను బాధ్యుడనైనట్టు ఆ చట్టాలు తీర్పు తీరుస్తాయి. వయస్సు వచ్చినవాడిగా నేనున్న చట్టాలు, నేను పసివాడిగా ఉన్ననాటి చట్టాలకు భిన్నమైనవై ఉన్నాయి.

మొదటి శతాబ్దపు యూదులు కూడా అలాటి పరిస్థితులలో ఉన్నట్టు తమ్మును తాము కనుగొన్నారు. ఆత్మసంబంధమైన రెండురకాలైన చట్టాలు లేక నిబంధనల క్రింద ఉండేవారు. వారు మోషే ధర్మశాస్త్రం క్రింద దేవాలయమునొద్ద బలులనర్పిస్తూ, సంవత్సరానికి చెందిన పండుగలనాచరించుతూ, ప్రత్యేకించి యాజకుల ద్వారా దేవుని సమీపించుతూ, ఇశ్రాయేలీయులకు దేవుడనుగ్రహించిన యితర చట్టాలన్నిటిని ఆచరించుతూ ఉండేవారు. క్రీస్తుప్రభువు యొక్క పునరుత్థానానంతరం వచ్చిన తొలి పెంతెకొస్తు దినమున క్రైస్తవ్యానికి యెరూషలేములో ప్రారంభోత్సవం జరిగింది. ఆయన సంఘముగా కొందరు యూదులు ప్రభువైన యేసును వెంబడించడానికి తీర్మానించుకొని,

మోషే ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టి, దేవునియొక్క క్రొత్త నిబంధనలో ప్రవేశించి, క్రొత్త నియమావళి క్రిందికి వచ్చారు. క్రొత్త నిబంధన క్రింద క్రైస్తవులుగా, విశ్వాస మూలంగా జీవిస్తారు, అపొస్తలుల ద్వారా బయలుపరచబడిన క్రీస్తు ప్రభువుయొక్క యిష్ట ప్రకారం జీవిస్తారు, క్రీస్తు యొక్క ఆత్మసంబంధమైన శరీరంగా దేవుని ఆరాధిస్తారు.

మోషే ధర్మశాస్త్రంనుండి క్రైస్తవ్యానికి కొందరు మార్చుకొనగా, ప్రత్యేకంగా నిలిచిన ఒక సత్యమేమంటే, ప్రత్యేకంగా ఏర్పరచబడిన ఒక వంశంవారు మాత్రమే యికను ఏ మాత్రమును యాజకులు కారని, దేవుని ప్రజలందరును యాజకులే అనేది. క్రొత్త నిబంధన ప్రకారం, తన రక్తంతో కడుగబడిన వారినందరిని క్రీస్తు ప్రభువు "తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగానుజేసెను" (ప్రకటన 1:6). క్రీస్తునందు మనము, "ఏర్పరచబడిన వంశమును రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై" యున్నాం (1 పేతురు 2:9). "ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు" మనము క్రీస్తు ప్రభువు సంఘానికి చేర్చబడ్డాం (1 పేతురు 2:5). విశ్వాసులందరును యాజకులనే సత్యం, ఆనాటి యూదులకువలె నేడు మనకును తట్టి, మనలో ఆశ్చర్యమును, భయభక్తియు, కృతజ్ఞతతో కూడిన భావమును రేకెత్తించాలి.

సంఘమంతా యాజక జనమనే లక్షణం సరిగా గ్రహించినప్పుడు, ప్రతి క్రైస్తవుని అది ప్రోత్సహించుతోంది. గత యుగంలో, లేవీయులను తన యాజకులనుగా చేసికొని దేవుడు వారిని ఘనపరచాడు; అయితే ప్రస్తుత యుగంలో, క్రీస్తులోనికి వచ్చిన ప్రతి వ్యక్తిని తన రాజ్యములో యాజకునిగా (ఆమెను గాని అతని గాని) ఆయన ఘనపరచాడు.

దేవుని పిల్లలందరు యాజకులన్న విషయం మనలను పట్టిందా? దాని యొక్క ప్రాముఖ్యతను చూడగలిగామా? దానిని గూర్చి లోతుగా ఆలోచించుదాం.

## దేవునినుండి కలిగిన యాజకాధిక్యత

క్రైస్తవులైనవారికి యాజకులయ్యే భాగ్యం ప్రసాదింపబడింది. పాత నిబంధన ప్రవక్తలకు జరిగించినట్టే, దేవుడు తనతో ప్రత్యేకమైన బాంధవ్యంతో వారిని ఘనపరచాడు.

మోషే కాలపు యాజకులకు దేవునితో ఒక ప్రత్యేకమైన సహవాస భాగ్యము అనుగ్రహించబడింది. ఇతర ఇశ్రాయేలీయులు అనుభవించలేనంతగా వారు దేవుని సముఖంలో అనుదినము జీవించారు. విడిది దిగిన ప్రతి స్థలంలో, వారి గుడారములు ప్రత్యక్షగుడారానికి ఎదురుగా, దృశ్యమగు దేవుని ప్రసన్నతకు సమీపంగా వేయబడేయి. ఇశ్రాయేలీయులు కనానులో స్థిరపడినప్పుడు, యాజకులు, లేవీయులతోపాటు, ఆ దేశపు భూ భాగాన్ని పొందక, దేవునినే వారి స్వాస్థ్య భాగంగా పొందారు. వారు నలభై ఎనిమిది పట్టణాలను వాటి చుట్టుపట్లనున్న పశ్చిక భూములను నివాస స్థలాలుగా వారు పొందిన మాట వాస్తవమే గాని (యెహోషువ 21:41), తమ కాలము దేవుని సేవకు పూర్తిగా అర్పింపబడేలా వారు మిగిలిన గోత్రములచేత పోషింపబడేవారు. ఇశ్రాయేలీయులచే ప్రత్యక్షగుడారము వద్ద అర్పింపబడడానికి తేబడిన ఏ అర్పణయైనా, దేవుని యాజకులచే

అర్పింపబడేది. ప్రీతికరమైన సహవాసాన్ని తనతో పొందేలా దేవుడు యాజకులను ప్రత్యేకపరచుకున్నాడు.

పాత నిబంధన కాలంలో దేవునితో యాజకులచే అనుభవింపబడిన సన్నిహిత సంబంధం క్రైస్తవ యుగంలో ప్రతి క్రైస్తవునికి ప్రసాదింపబడింది. సువార్త ద్వారా దేవుని యొద్దకు వచ్చు ప్రతివాడును ఆయన కుటుంబంలోనికి చేర్చుకోబడతాడు, "తన సొత్తుగా" చూడబడ్డాడు (తీతు 2:14). ఒకప్పుడు ప్రజలు కానివారు ఇప్పుడు "దేవుని ప్రజలయ్యారు" (1 పేతురు 2:10), ఒకప్పుడు దేవునికి "దూరస్థులైనవారు" (ఎఫెసీ. 2:17), యిప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులుగా చేయబడ్డారు (ఎఫెసీ. 2:13). దేవుడు (యోహాను 14:23), క్రీస్తు (ఎఫెసీ. 3:17; కొలస్సీ. 1:27), మరియు పరిశుద్ధాత్మ (1 కొరింథీ. 6:19, 20) మనలో నివసిస్తారు. అనుదిన సహవాసములో మనం తండ్రి, క్రీస్తు ప్రభువు (1 యోహాను 1:3), మరియు పరిశుద్ధాత్మలతో నడుస్తాం (రోమా 8:5).

సీనాయి కొండమీదనుండి మోషే పది ఆజ్ఞల పలకలను తొలిసారిగా తెచ్చింది, బంగారు దూడ ముందు ఇశ్రాయేలీయులు విగ్రహ సంబంధమైన పూజ చేస్తున్నట్టు కనుగొనడానికే. "ఈ పది ఆజ్ఞలతో నేను సీనాయి కొండ దిగి రాకముందే, మీరు వాటిని అతిక్రమించి యున్నారని" చెప్పినట్టుగా, అతడు ఆ పలకలను నేలను పడవేశాడు! అతడు ఆ దూడను పొడిచేసి, నీళ్లమీద చల్లి, ఆ నీళ్లను జనులచే త్రాగింపజేశాడు. ఆ విడిది ముఖ ద్వారమునొద్ద మోషే నిలిచి, "దేవుడైన యెహోవా పక్షముగానున్నవారు నా ప్రక్కకు వచ్చి నిలువుడి" అని చెప్పాడు! వెంటనే, లేవీ గోత్రం ధైర్యంగా మోషే ప్రక్కకు వచ్చి నిలిచింది. ఈ విగ్రహ సంబంధమైన ఆరాధనలో దోషులైన వారినందరిని సంహరించుడని మోషే ఆజ్ఞాపించాడు. వారు అతని ఆజ్ఞను నమ్మకంగా అమలు జరిపారు, దేవుని తీర్పునకు వారు సాధనాలుగా నిలిచారు. వారు దేవునికి నమ్మకస్థులైనందున, ఏర్పరచబడిన తన యాజక జనంగా మోషే యుగమంతటిలో దేవుడు వారిని ఘనపరచాడు. అహ్రోను కుటుంబికులు ఆయన యాజకులు మిగిలిన లేవీ గోత్రికు లందరు వారికి సహాయము చేయువారై ఉండేవారు. లోకంలో దేవునిచేత ఏర్పరచుకున్న ఆయన సేవకులకు చెందవలసిన ఘనత – దేవుడు నరులకు ప్రసాదించగల గౌరవం లేవీ గోత్రికులు పొందారు!

క్రీస్తు ద్వారా, పాత నిబంధన కాలంలో లేవీయులకు మాత్రమే ప్రసాదించిన ఘనత, నేడు ఎవడైనను పొందవచ్చు. విశ్వాసంతోను, విధేయతతోను వచ్చువాడెవడైనా దేవునిచే ప్రత్యేకపరచబడిన ప్రజలలో చేర్చబడినవాడై, ఆయన పరిశుద్ధమైన యాజక జనంలో ఉంటాడు.

ఆశ్చర్యకరమగు ఈ సత్యం మనకొక వర్తమానమిస్తుంది. మొదటిగా, విమోచింపబడిన తన ప్రజలకు దేవుడు తన దృష్టిలో ప్రాధాన్యతను విలువను యిచ్చాడని అది మనకు గుర్తుచేయాలి. ఏమిలేని స్థితిలోనుండి ప్రత్యేకమైన తన సొత్తుగా ఉండునట్టు చేయబడ్డాం. మనం కేవలం "జనులం" కాదు, మనము "దేవుని ప్రజలై" ఉన్నాం. దీనితోపాటు, ఈ లోకంలో మన పనిని యిది వివరిస్తుంది. ప్రత్యేకింపబడిన భావంలో మనం దేవుని సేవకులమైయున్నాం. పైగా, ఈ సత్యం మనయందు మృతిచెందని

కృతజ్ఞతను ఉద్భవింపజేస్తుండాలి. మనం ఎక్కడ ఏమైయుండాలో అది దేవుని కృపవలనే అయ్యున్నాం.

## దేవుని వద్దకు యాజకత్వపు ప్రవేశం

క్రీస్తు యొక్క ఆత్మసంబంధమైన శరీరంలో అవయవములైనవారు దేవుని వద్దకు యాజకత్వపు ప్రవేశం గలవారైయున్నారు. దేవుని సమీపించడానికి మనం మరి ఏ యితర మనిషి ద్వారా వెళ్లనవసరం లేదు. క్రీస్తు ద్వారా దేవునియొద్దకు తెరువబడిన ప్రవేశం మనకు ఉంది.

మానవ యాజకుని ద్వారానే యూదులు దేవుని సమీపింపగలిగేవారు. యూదులతో దేవుడు ప్రవక్త ద్వారానో యాజకుని ద్వారానో మాట్లాడేవాడు, మరియు యూదులు దేవునికి యాజకుని ద్వారా బలులు అర్పించేవారు. "దేవునికిని వారికిని మధ్య" ఉన్న ఖాళీని కలపడానికి వారికి మధ్యస్థం చేసే నరులు ఉండవలసియుండేది.

ఇప్పుడు, క్రీస్తునందు, ప్రభువైన యేసుద్వారా క్రైస్తవుడు నేరుగా దేవుని సన్నిధికి చేరవచ్చు. యూదులకేమి అన్యజనులకు కూడా దైవ మానవుల మధ్యనున్న ప్రతివిధమైన అడ్డంకులు తొలిగించబడ్డాయి. క్రీస్తునందు యాజకులకును అన్యజనులకును మధ్యనున్న ఏకత్వాన్ని గూర్చిన సమాచారానికి చివరి భాగంలో, పౌలు ఈ సంగతిని ప్రస్తావించాడు: "ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగి యున్నాము" (ఎఫెసీ. 2:18). తరువాత పౌలు యిలా వ్రాశాడు, "ఆయనయందలి విశ్వాసముచేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును ఆయననుబట్టి మనకు కలిగి యున్నవి" (ఎఫెసీ. 3:12). దేవునియొద్దకు వచ్చుటలో క్రైస్తవులకు ప్రభువైన యేసు ఒక్కడే మధ్యవర్తి: "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" (1 తిమోతి 2:5).

నా జీవితంలో యిద్దరు ప్రసిడెంట్లు ఉన్నారు. నేను అనుదినం బైబిలు ఉపదేశించే హార్డింగ్ యూనివర్సిటీ ప్రసిడెంట్ నాకు ఎక్కువ సమీపంగా ఉన్నాడు. ఆయన నా బాస్. ప్రార్థనా స్థలంలో నేను అనుదినం ఆయన్ను చూస్తాను. టీచర్స్ మీటింగ్స్‌లో, హాల్లో ఆయన్ను ఎదుర్కొన్నప్పుడు తరచుగా ఆయనతో మాట్లాడుతూ ఉంటాను, హాల్లో నేను ఆయన్ను దాటిపోతూ ఉంటాను. సాంఘీక ఉత్సవాల్లో నేను ఆయన్ను దర్శిస్తాను కాలేజ్ చర్చ్ మీటింగ్స్‌లో, నేను బయట ప్రసంగించడానికి వెళ్లకపోతే, ఆరాధనా సమయంలో ఆయన్ను చూస్తాను. ఆయనతో తరచుగా మాట్లాడుతూ ఉంటాను, చాల సంవత్సరాలుగా నేను ఆయనతో కలిసియున్నాను గనుక ఆయన నా వ్యక్తిగతమైన స్నేహితుడని నేనాయన్ను అంటాను. రోజులో ఏ సమయంలోనైనా ఆయనకు ఫోన్ చేస్తాను, నేను కోరే విషయం గూర్చియైన ఆయనతో మాట్లాడడానికి అనుమతింపబడ్డాను. తాను నేరుగా టెలిఫోన్ సంభాషణకు రాకపోతే, తాను ఎంత త్వరగా ఫోన్ కాల్ తిరిగి చేయగలడో అంత త్వరగా చేస్తాడు.

నా జీవితంలోని రెండవ ప్రసిడెంట్ అమెరికా దేశపు ప్రసిడెంట్. నేనెప్పుడు ఆయనతో

వ్యక్తిగతంగా మాట్లాడ లేదు. వ్యక్తిగతంగా ఆయనను ఒకే ఒక్కసారి చూచాను, అదికూడా దూరంనుండి – ఆయన కారులో వెళ్ళేటప్పుడు. ఆయన్ను గూర్చి నాకు తెలిసిందంతా నేను వార్తా పత్రికలలో చదివేది, టి.విలో చూచేది మాత్రమే. నేను ఆయన్ను ఒక స్నేహితుడుగా ఎరుగుదునని నేను చెప్పలేను. ఆయన వ్యక్తిగతమైన జీవితాన్ని గూర్చి మొదటి సమాచారం ఏమీ నేనెరుగను, నన్ను గూర్చి ఆయన ఏమీ ఎరుగడు. నేనేదైన ముఖ్యమైన విషయాన్ని గూర్చి ఆయనతో మాట్లాడగోరినా నాకు అనుమతి లభించదు. ఆ సందేశం ఆయనకు పంపబడుతుందని మాత్రం నాకు ప్రామిస్ చేయబడుతుంది. నానుండి బహు దూరంగా తొలిగింపబడిన లోకంలో ఆయన జీవిస్తాడు. ఆయన జీవితంతో నాకు ఎలాటి సంబంధం లేదు – మా దేశం నాలుగు సంవత్సరాలకు ఒక ప్రసిడెంటును ఎన్నుకునే సమయంలో ఓట్ వేసే మెషీన్ సమీపించినప్పుడు తప్ప ఆయన అధికారంతో మాత్రం పొత్తేముంటుంది. ఇంతకు జరిగేదేమంటే ఆయన నన్ను ఎన్నడూ చూడడు నేను ఆయనను చాలా దూరంనుండి చూస్తాను.

---

విశ్వాసము విధేయతల ద్వారా ఆయన యొద్దకు వచ్చువాడు
దేవునియొక్క వేరు చేయబడిన జనంతో, ఆయన
పరిశుద్ధమైన యాజక సమూహంలో చేర్చబడతాడు.

---

ఆ యిద్దరి ప్రసిడెంట్ల మధ్యగల వ్యత్యాసమేమి? అది కేవలం యిదే: ఒకనిని నేను చేరగలను మరొకని చేరలేను. వ్యత్యాసం “చేరడం” అనే ఒకే పదంలో ఉంది. నేను క్రైస్తవునిగా మారిన సమయంనుండి, దేవునితో నాకున్న బాంధవ్యం హార్డింగ్ యూనివర్సిటీ ప్రసిడెంట్‌తో నాకున్న బాంధవ్యంతో పోల్చవచ్చు. క్రీస్తు ప్రభువు ద్వారా, నాకు స్వతంత్రమైన నిరాటంకమైన ప్రవేశం దేవుని చెంతకు ఉంది. ఏ సమయంలోనైనా ప్రార్థనయందు ఆయనను సమీపించవచ్చు. ఆయన సహవాసంలోను, బలంలోను నేను అనుదినం నడుస్తున్నాను. ఆయన సర్వశక్తి గలవాడైనందున, ఆగుమనే ప్రసక్తి, తిరిగి పిలువవలసిన అవసరం ఉండదు. క్రీస్తు ప్రభువునుబట్టి, దేవుని ప్రసన్నతలోనికి ఆయన నన్ను ఆహ్వానిస్తాడు, నేను ఆయన ప్రసన్నతను వెదకుతాను, ఆయన నన్ను వెదకుతాడు. ఆయన నిజంగా నా పరలోకపు తండ్రియే! క్రైస్తవుడుగా నేను దేవుని సముఖానికి వెళ్లగలిగినట్టు మోషే ధర్మశాస్త్రం క్రింద ఉన్న యూదులు వెళ్లగలిగేవారు కారు. వారు దేవుని సన్నిధికి లేవీ యాజకుల ద్వారా వెళ్లేవారు. దేవుడు నిరంతరం వారికి మార్గదర్శిగా ఉండేవాడు, అయితే వారు దేవుని సన్నిధానానికి చేరేది మాత్రం మానవ యాజకత్వపు ఏర్పాటు ద్వారానే.

క్రైస్తవులు యాజకులుగా అనుభవించే ప్రవేశాన్ని గూర్చిన సత్యం కేవలం మనలను ప్రోత్సహించడం మాత్రమే గాక, అది మనలను బలపరచాలి కూడా. దేవుడు తన సన్నిధికి మనలను ఆహ్వానిస్తున్నాడు, మన సహవాసాన్ని అనుభవిస్తున్నాడు, తన బిడ్డలను తండ్రి తన యొద్దకు రానిచ్చిన రీతిని ఆయన సముఖానికి మనకు ప్రవేశం

యిస్తాడు. ప్రార్థన, సహవాసము, ఆత్మసంబంధమైన పరిచర్య ద్వారా ఈ అవకాశాన్ని మనం ఎంజాయ్ చేద్దాం.

## దేవునికొరకు యాజకధర్మం

క్రైస్తవులుగా, మనకు యాజక ధర్మముంది. మనం యాజకుల పనులు జరిగిస్తాం.

పాత నిబంధన కాలంలో, ఇశ్రాయేలీయులందరికొరకు యాజకులు బలులు అర్పించేవారు. దేవునియొక్క ఆరాధన జరిగేటప్పుడు ప్రత్యక్షగుడారపు పరిశుద్ధ స్థలంలోనికి యాజకులు మాత్రమే ప్రవేశించేవారు. ప్రత్యక్షగుడారము యొక్క ద్వారమునొద్ద నిలిచిన సామాన్యమైన ఇశ్రాయేలీయుడు, గుడారంలో యాజకుని మూలంగా ప్రాతినిధ్యమియ్యబడే వాడు. గొప్ప ప్రాయశ్చిత్త దినమున అతి పరిశుద్ధమైన స్థలానికి ప్రధాన యాజకుడు మాత్రమే ప్రవేశిస్తాడు; అది కూడ ప్రాయశ్చిత్త రక్తంతో, మరొక ప్రాయశ్చిత్త దినం వచ్చేవరకు దేశంయొక్క పాపం శుద్ధీకరించబడేలా దేవుని శాంతిపరచి వస్తాడు. ఈ ఆరాధనా బాధ్యతలు గాక, దేవుని చిత్తం విషయమై జనులు నమ్మిక కలిగియుండేలా, వారినోట ఇశ్రాయేలీయులు దేవుని మాటలు వినాలి.

క్రైస్తవ యుగంలో క్రైస్తవులు ఏమి చేయాలో అనేవాటికి పాత నిబంధనలోని యాజకులు జరిగించిన పరిశుద్ధమైన కార్యాలు సమాంతరాలుగా ఉన్నట్టు మనం కనుగొంటాం. క్రైస్తవ యుగంలో ఏ విధమైన జంతు బలులు అర్పించేది లేదు, కాని ఆత్మసంబంధమైన బలులగు – పాటలు పాడడం, ప్రార్థించడం, ప్రభురాత్రి భోజనం చేయడం, కానుకలు సమర్పించడం, దేవుని వాక్యాన్ని పఠించడం, క్రైస్తవ పరిచర్య జరిగించడం ప్రతి క్రైస్తవునిచే దేవునికి అర్పించబడుతుంటాయి. పాడుటను గూర్చి హెబ్రీయుల లేఖికుడు యిలా అన్నాడు, "కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ. 13:15). ప్రకటనలో, ప్రవచనపు భాషలో, భూమిమీదనున్న పరిశుద్ధులయొక్క ప్రార్థనలు సువర్ణ ధూప వేదికమీద వేయబడిన ధూపమైయున్నట్టు వర్ణింపబడింది (ప్రకటన 8:3). "యేసుక్రీస్తు ద్వారా దేవునికి ఆత్మసంబంధమైన బలులు అర్పించడం" భూమిమీద సంఘం జరిగించవలసిన పనులలో ఒకటైయుంది (1 పేతురు 2:5). క్రీస్తు ప్రభువుయొక్క రక్తం ద్వారా దేవునియొద్దకు క్రైస్తవునికి ద్వారం ఎల్లప్పుడు తెరువబడియున్నట్టు హెబ్రీయుల లేఖికుడు చిత్రించాడు:

> సహోదరులారా, యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరము అను తెరద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని యింటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానముచేసిన శరీరములు గలవారమునైయుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము (హెబ్రీ. 10:19–22).

క్రీస్తుయేసు మనకు నిత్యమైన ప్రధాన యాజకుడుగా నిలిచి యున్నందున, యాజకుడుగా ప్రతి క్రైస్తవుడును ఎక్కడైనా, ఏ సమయంలోనైనా ఆయన ద్వారా దేవుని సన్నిధానానికి వెళ్లవచ్చు. మన రక్షకుడు నిత్యమైన రక్షణను సంపాదించి, "తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధస్థలములో ప్రవేశించెను" (హెబ్రీ. 9:12). సంవత్సరమునకు ఒక్కసారి పాత నిబంధన కాలంలోని ప్రధాన యాజకుడు ఆ జనాంగం యొక్క పాప పరిహారంకొరకు అతి పరిశుద్ధ స్థలంలోనికి జంతు బలియొక్క రక్తాన్ని తీసికొనిపోయేవాడు, కాని క్రీస్తు ప్రభువు తన్ను తాను అర్పించుకొని పరలోకంలో ప్రవేశించాడు (హెబ్రీ. 9:24, 25). ఇప్పుడు, క్రీస్తువారు చేసిన వ్యక్తిగతమైన బలిద్వారా, ఆయన నిత్యము మన ప్రధాన యాజకుడుగా నిలిచియుంటాడు, ఈ విధంగా దేవుని యెదుట మనకు వ్యక్తిగతమైన యాజకత్వాన్ని ప్రసాదించాడు. దీనినిబట్టి, రక్షించు ఆయన కృప సర్వ మానవాళి ఎరుగునట్లు, లోకమందంతట దేవుని వాక్యం ఉపదేశింపబడవలసిందిగా క్రైస్తవులు ఆజ్ఞాపించబడ్డారు (మార్కు 16:15, 16).

ఒక వస్తువు చేసే పని సహజంగా దాని పోలికను సూచిస్తుంది. పొడవైన పిడి ఉండి, వంకరగా తిరిగియుండి చివర పొదునుగా ఉండేదాన్ని మట్టిని త్రవ్వడానికి ఉపయోగిస్తాం; దాన్ని పార అని అంటాం. చిన్న పిడి ఉండి, లోహపు తల దాని చివరి భాగంలో బిగింపబడియుండేదాన్ని మేకులు దిగగొట్టడానికి వినియోగిస్తాం గనుక సుత్తి అని అంటాం. దేవుని ఎదుట యాజక ధర్మాన్ని క్రైస్తవులు నిర్వహిస్తారు గనుక అట్టివారిని క్రొత్త నిబంధన యాజకులని పిలవడంలో మనం ఆశ్చర్యపడనవసరం లేదు. క్రొత్త నిబంధనలో ముమ్మారు క్రైస్తవులు యాజకులని ప్రత్యేకంగా సూచింపబడ్డారు (ప్రకటన 1:6; 5:10; 20:6); మరియు లెక్కలేనన్నిసార్లు వారి పనినిబట్టి వారి యాజకత్వం గుప్తం చేయబడింది (1 పేతురు 2:5, 9; హెబ్రీ. 13:15).

దేవుని యాజకులనుగా ఈ లోకమందు మనం పని జరిగించడానికి గాను ప్రభువుచే మనం ఆహ్వానింపబడ్డామనే సత్యం మన పని మరియు మన సేవ అనే విషయాల్లో తేటైన దృష్టి మనం కలిగియుండడం ప్రాముఖ్యం. పాత నిబంధన యాజకుడెవడైనా – తాను దేవుని ప్రత్యేకమైన సేవకుడైయుండి; ఆయన జనాంగాన్ని దేవుని సముఖమందు ఆరాధనలోను, సేవలోను నడిపించడంలో, తన కార్యకలాపాలను ఆవరించి ప్రాధాన్యత ఉన్నట్టు అతడు గుర్తెరుగుతాడు. అలాగే, నేడు దేవుని పరిశుద్ధమైన యాజక జనంగా, తన భూమిమీద ఆరాధించే, సేవించే, ఉపదేశించే సాటిలేని పనులను మనకు అప్పగించి నందున కృతజ్ఞతతో పని చేద్దాం.

దేవుని యాజకులుగా మనం పని కలిగియున్నందున, గొప్ప బాధ్యతను మనం వహించాలి. బరువులు ఆయా గమ్యాలకు తరలించడంలో లారీలను తీసికొని వెళ్లేవారు ఆ గేటువద్దనున్న వ్రాతను చదివేలా ప్రధానమైన లారీల కంపెనీ ఒక పెద్దబోర్డు పెట్టింది: "ఈ గేటు దాటితే, నీవు ఈ కంపెనీకి ప్రాతినిధ్యం యిస్తావ్." జనులు ఆ లారీ డ్రైవర్లను చూచినప్పుడు, వారు ఆ కంపెనీని చూస్తారు. మనం దేవుని యాజకులమై ఉన్నందున, లోకంలో మనం దేనికి ప్రాతినిధ్యమిస్తాం. తోటి యాజకులారా, మీ బాధ్యతలను మీరు తీవ్రంగా తీసికొంటున్నారా?

## ముగింపు

క్రైస్తవ యుగంలో క్రైస్తవులు దేవుని పరిశుద్ధమైన యాజక సమూహం. దేవుని సముఖంలో యాజకులుగా మనకు ప్రవేశముంది, యాజకుల ఆధిక్యతలు మనకు అనుగ్రహింపబడ్డాయి, మరియు లోకంలో మనం యాజక ధర్మాలు జరిగిస్తున్నాం. మనం దేవుడైన యెహోవాయొక్క స్వజనంగా వేరుచేయబడినందున మనకు మహా ఘనత లభించింది. దేవునివలె మనముకూడా పరిశుద్ధులుగా ఉండడానికి పిలువబడినందున మహోన్నతమైన పిలుపు మనకు యివ్వబడింది. దేవుని యాజకులుగా పని యివ్వబడినందున మనకు మహా గొప్ప పని ఉంది.

నీవు క్రైస్తవుడవా? క్రీస్తు నీ పాపములను కడిగి నిన్ను దేవునియొక్క యాజకునిగా చేసేలా నీవు సమ్మతించావా? క్రైస్తవుడు ఏమి పొందబోతాడు అనే దానికొరకు మాత్రమే కాదు, క్రైస్తవుడు ఏమైయున్నాడు, అతడేమి చేస్తాడు అనే దానికొరకు కూడా మనం క్రైస్తవులమైయుండాలి.

మన గీతములు మన అభిలాషలను, నమ్మకత్వాలను, మన విలువలను చాటుతాయ్. ఇది పరలోకంలోనూ సత్యమైయుంటుంది. పరలోకంలో ఏలాటి గీతములు గానం చేయబడతాయ్? సింహాసనాసీనుడగువాని కుడిచేతిలోనుండి గొర్రెపిల్ల ఆ గ్రంథమును తీసికొన్నప్పుడు పరలోకపు కోర్టు ఏమి గానం చేశారో గుర్తించు:

> నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు, నీవు వధింపబడినవాడవై నీ రక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవునికొరకు మనుష్యులను కొని, మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి; గనుక వారు భూలోకమందు ఏలుదురు (ప్రకటన 5:9, 10).

నీ దేశముయొక్క ప్రసిడెంట్‌చే తన క్యాబినెట్‌లోని భాగంగా పని చేయడానికి నీవు ఆహ్వానింపబడితే అంగీకరిస్తావా? తప్పకుండ. నీ పట్టణంయొక్క మేయర్‌చే, ఆ పట్టణానికి ప్రత్యేకమైన పనివాడవుగా ఉండమని కోరితే, నీవు అంగీకరిస్తావా? తప్పక నీవు అంగీకరిస్తావు. ఈ విశ్వానికి సృష్టికర్తయైన దేవుడు, తన కుమారుని ద్వారా నీకు విమోచనను ప్రసాదించినవాడు, తనయొద్దకు వచ్చి తన పరిశుద్ధ యాజకులలో ఒకడుగా ఈ లోకములో పనిచేయడానికి నిన్ను రమ్మంటున్నాడు. నీవు అంగీకరిస్తావా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. మీ దేశంలో పసివారికి, పెద్దవారికి సంబంధించిన చట్టాలను పోల్చి చూడు.
2. మోషే ధర్మశాస్త్రమా లేక క్రీస్తుయొక్క క్రొత్త చట్టమా – మొదటి శతాబ్దంలోని యూదులు ఏ చట్టం క్రింద ఉండాలో తెలియక ఎలా తడబడ్డారో వర్ణించు.
3. క్రైస్తవులుగా మారిన యూదుల మనస్సులో నిజంగా వ్యత్యాసంగా నిలిచినది ఏదని నీవు తలంచుతావ్?

4. పాత నిబంధన యాజకులకును దేవునికిని మధ్య ఏ రకమైన ప్రత్యేక బాంధవ్యం నిలిచియుండేది?
5. నేడు దేవుని యాజకులుగా ఉండడంలో మనకు ఏలాటి విలువ ప్రాధాన్యత యివ్వబడుతుంది?
6. "దేవుని వద్దకు ప్రవేశము" అనే ప్రయోగానికి అర్థమేమి?
7. "దేవుని వద్దకు ప్రవేశం" కలిగినందువలన వచ్చే ప్రత్యేకమైన ఆశీర్వాదములేవి?
8. నేడు దేవుని యాజకులుగా మనమెలా పని చేస్తాం?
9. క్రైస్తవులు దేవుని యాజకులని తెలిపే లేఖనాలను పేర్కొనుము.
10. ప్రకటన 5:9, 10 విశ్వాసుల యొక్క యాజకత్వాన్ని ఎలా తెలుపుతుంది?
11. నేడు ఒకడు ఎలా దేవుని యాజకుడు కాగలడు?
12. నేడు ఎవరైనా దేవుని యాజకుడు కాగలడా?